క్లుప్తంగా

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

- పాణ్యం నియోజకవర్గ ఆర్వో నారపురెడ్డి మౌర్య



ఓటరు అవగాహన ర్యాలీలో ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు: నియోజకవర్గంలోని ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పాణ్యం ఆర్వో/ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. బుధవారం కల్లూరు మండలంలోని చిన్నకొట్టాల, పెద్దకొట్టాల, కె.మార్కాపురం, పర్ల, ఎ.గోకులపాడు, నెరవాడ, సల్కాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కె.మార్కాపురం గ్రామంలో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి ఓటు చాలా విలువైందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులను పరిశీలించారు. ఓటర్లు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నచ్చిన వారికి ఓటు వేసుకోవచ్చన్నారు. ఓటు హక్కు స్వేచ్ఛపై (స్వీప్) సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం ర్యాలీ నిర్వహించామన్నారు. యువత ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి ఓటర్లకు తెలియజేసి వారి ఓటును సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.

పింఛన్ల పంపిణీపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ మల్లీశ్వరి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో పింఛన్ల పంపిణీపై సమీక్షించారు. మండలంలో మొత్తం 7,458 మంది పింఛన్‌దారులు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 70 శాతం మంది వయోవృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడేవారికి గురువారం నుంచి ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. మిగతా 30 శాతం మందికి ఆయా పంచాయతీ/సచివాలయాల వద్ద పంపిణీ చేయాలని తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

కర్నూలులో 'ఐ లవ్ బీఎస్ఎన్ఎల్'



కొండారెడ్డిబురుజు వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్ బోర్డు వద్ద బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

కర్నూలు (న్యూటౌన్): భారత ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌ను ప్రజలు ఎల్లప్పుడూ ఆదరిస్తున్నారని బీఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి.రమేష్ అన్నారు. బుధవారం రాత్రి నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద బీఎస్ఎన్ఎల్ సీటీఓ ఎక్స్ఛేంజ్ బిల్డింగ్ దగ్గర ఏర్పాటు చేసిన ఐ లవ్ బీఎస్ఎన్ఎల్ గ్లో లైటింగ్ బోర్డును ఆయన ప్రారంభించారు. బీఎస్ఎన్ఎల్‌ను ప్రజలందరూ మరింత ఆదరించాలని కోరారు. త్వరలో బీఎస్ఎన్ఎల్ స్వదేశీయంగా తయారు చేసిన టెక్నాలజీతో 4జీ సర్వీసులను ప్రారంభిస్తామన్నారు. వినియోగదారులందరూ 4జీ సిమ్‌లోకి అప్‌గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. గతంలో పేపర్ అప్లికేషన్ ద్వారా యాక్టివేషన్ చేసిన సిమ్‌లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం వినియోగదారులు తమ దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో, ఫ్రాంచైజీని సందర్శించి కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. భారత్ ఫైబర్ ఇంటర్నెట్ సర్వీసులను అతి తక్కువ ధరతో అందిస్తున్నామని తెలిపారు. కేవలం రూ.599కే 75 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 4 వేల జీబీ వరకు ఉచితంగా డిస్నీ+హాట్‌స్టార్ సూపర్ ప్లాన్ ఓటీటీ సర్వీసులను ఈనెల 1వ తేదీ నుంచి ఇస్తున్నామన్నారు. ఫైబర్ నెట్ యూజర్ల కోసం 1800 4444 వాట్సాప్ చాట్‌బాట్ ప్రారంభించామని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ డీజీఎం బి.సాయినాథ్, కర్నూలు అర్బన్ ఏజీఎం వి.శ్రీను నాయక్, ఆపరేషన్ పి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు

కోడుమూరు రూరల్: గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని ఏపీఓ మోదీన్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ప్రతి కూలీకి రూ.300 వేతనం పడేలా కొలతలు ప్రకారం పనులు చేయించాలన్నారు. పనుల్లో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఎండ దృష్ట్యా కూలీలంతా ఉదయాన్నే పనుల్లోకి వచ్చి త్వరగా పనులు పూర్తి చేసుకుని ఇండ్లకు వెళ్లేలా చూడాలన్నారు. పనులు చేసే చోట మంచినీరు, నీడ కల్పించాలని ఆదేశించారు.

వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్ద పింఛన్లు తీసుకునే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు నేడు పడరాని పాట్లు పడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేతల రాజకీయ కుట్ర వారి పాలిట శాపంగా మారింది. తన అనుకూల సంస్థ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వలంటీర్ల ద్వారా పింఛన్లు రాకుండా అడ్డుకున్నారు. సచివాలయాల్లో పంపిణీ చేయాలని ఈసీ ఆదేశించడంతో బుధవారం ఉదయం నుంచే సచివాలయాల వద్ద వృద్ధులు పడిగాపులు కాశారు. చంద్రబాబు వల్లే తమకు ఈ కష్టాలు వచ్చాయని శాపనార్థాలు పెట్టారు. పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు.

పోలకల్ సచివాలయం వద్ద ఎదురుచూస్తున్న వృద్ధులు



పాణ్యం నియోజకవర్గంలో లబ్ధిదారుల వివరాలు		
మండలం	పింఛన్‌దారులు	పంపిణీ (సాయంత్రం 5 గంటల వరకు)
కల్లూరు(గ్రామీణ)	8432	3205
ఓర్వకల్లు	7836	906
పాణ్యం	6444	490
గడివేముల	5844	2048
మొత్తం	28,556	6,649



గడివేముల: సచివాలయంలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పింఛన్లకు పడిగాపులు

- ఉదయం నుంచే సచివాలయాల వద్ద ఎదురుచూపులు
- చంద్రబాబు నిర్వాకంపై మండిపాటు
- మళ్లీ పాత రోజులు వస్తాయని ఆందోళన
- పాణ్యం నియోజకవర్గంలో మొత్తం 28,556 మంది పెన్షన్‌దారులు
- తొలి రోజు కేవలం 6,649 మందికి పంపిణీ

కోడుమూరు రూరల్/కల్లూరు/గడివేముల: ఐదేళ్లుగా ఇంటి వద్దే అవ్వతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు సంతోషంగా పింఛన్లు తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లను దూరం పెట్టాలని టీడీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఏప్రిల్, మే, జూన్ నెలలో వలంటీర్లకు బదులుగా సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. బుధవారం ఉదయం నుంచే ఆయా గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులే కన్పించారు. చంద్రబాబు నిర్వాకంతో మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించిందని పెన్షన్‌దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు సచివాలయాల్లో నగదు రాలేదు మళ్లీ రావాలని గ్రామ సచివాలయ సిబ్బంది చెప్పారు. మమ్మల్ని ఇబ్బందులు పెడితే చంద్రబాబుకు ఏమి వస్తుంది, మా మీద ఈ అక్కసు ఏంటి అంటూ వృద్ధులు శాపనార్థాలు పెడుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. పాణ్యం నియోజకవర్గంలో మొత్తం 28,556 మంది లబ్ధిదారులు ఉండగా బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి 6,649 మందికి పంపిణీ చేశారు.

పింఛన్ కష్టాలు

గూడూరు: పట్టణంలోని 2, 3, 4 వార్డు సచివాలయాల వద్ద ఉదయం నుంచే పింఛన్‌దారులు వేచి చూశారు. అయితే సచివాలయ సిబ్బంది గురువారం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పడంతో నిరాశతో తిరుగుముఖం పట్టారు. టీడీపీ రాజకీయ కుట్రల వల్ల తాము కష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



కోడుమూరులో వేచివున్న వృద్ధులు

సి.బెళగల్: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 7,253 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచే ఆయా గ్రామ సచివాలయాలకు చేరుకున్నారు. తీవ్రమైన ఎండలోనే పింఛన్ల కోసం ఎదురుచూశారు. కొందరు వృద్ధులు నడవలేని స్థితిలో ఇబ్బందులు పడుతూ సచివాలయాలకు వెళ్లారు.

సచివాలయాల వద్ద ఇక్కట్లు

పాణ్యం: మండలంలో సచివాలయాల తలుపులు తీయకముందే పింఛన్‌దారులు ఎండను సైతం లెక్క చేయకుండా పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు వేచి ఉండి పింఛన్ తీసుకున్నారు. ఇంటి వద్దే పింఛన్లు తీసుకునే తమకు ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది రాత్రి 7 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేశారు.



ఆలమూరులో సచివాలయానికి వస్తున్న దివ్యాంగుడు

చాలా కష్టంగా ఉంది



మొన్నటి వరకు ఇంటి వద్దే పింఛన్ తీసుకున్నా. ఇప్పుడు వలంటీర్లు ఉండరాదని, వారు పింఛన్ ఇవ్వరాదని అంటున్నారు. సచివాలయానికి వచ్చేందుకు గంట పట్టింది. మంచి చేసే వారిని అభినందించాలే కానీ రాజకీయం చేసి మాలాంటి పేదలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు.

–లలితమ్మ, వృద్ధురాలు, పోలకల్

ఇబ్బంది పెట్టడం సరికాదు



ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తోందని వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం సరికాదు. దీని వల్ల మాలాంటి పేదలు, పెన్షన్ సొమ్ముతో మందులు తీసుకుంటున్న వారు ఎంతో ఇబ్బంది పడుతారు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడుకున్న టీడీపీకి ఎన్నికల్లో ఓటు ద్వారా గుణపాఠం తప్పదు.

–కె.చిన్న అయ్యన్న, బస్తిపాడు, కల్లూరు

పెద్ద తప్పు చేశారు



మాలాంటి వారికి ప్రభుత్వం వలంటీర్లతో ఇళ్ల దగ్గరకే పథకాలు, సేవలు, పింఛన్లను అందిస్తుంటే చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు ఇలా కష్టాలను తెచ్చిపెట్టారు. వలంటీర్లతో కాకుండా ఆఫీసులో తీసుకోవాలని చెప్పడం దారుణం. సాఫీగా తీసుకునేవాళ్లం. ఇప్పుడు కష్టాలు పడే పరిస్థితి తెచ్చారు. మమ్మల్ని ఇబ్బంది పెట్టిన వారు నష్టపోతారు.

–ఖాజాహుసేన్, వృద్ధుడు

చంద్రబాబుకు మనస్సు లేదు



కట్టుకున్న భర్త కాలం చేయడంతో నా అనేవాళ్లు లేక జగనన్న ఇచ్చే రూ.3వేల పింఛన్‌తో కాలం గడుపుతున్నా. అలాంటిది ఈనెల పింఛన్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. ప్రతి నెలా వలంటీర్ ఇంటికొచ్చి అవ్వ పింఛన్ తీసుకో అంటూ ఇచ్చిపోయేవాడు. అలాంటి వలంటీర్‌తో మాకు పింఛన్ ఇవ్వకుండా చేయడం వల్ల చంద్రబాబుకు ఏమి వస్తుందో అర్థం కావడం లేదు. బాబు నిర్వాకం వల్ల పాతరోజుల్లో మాదిరి ఆఫీసుల వద్దకే వచ్చి పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్నా. చంద్రబాబుకు మనస్సు లేదు.

–మారెమ్మ, పింఛన్‌దారురాలు, కోడుమూరు

సంతోషాన్ని దూరం చేశారు



టీడీపీ పాలనలో పింఛన్ల కోసం వారం రోజుల పాటు తిరగాల్సి వచ్చేది. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక వలంటీర్ ప్రతి నెల ఒకటో తేదీ ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చేవాడు. సంతోషంగా ఉన్నాం. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ పాత కష్టాలు గుర్తు చేశారు. మేం సంతోషంగా ఉండడం ఆయనకు ఇష్టం లేదేమో. మేం అవస్థలు పడుతుంటే చంద్రబాబుకు సంతోషంగా ఉంటుందేమో.

–వెంకట లక్ష్మమ్మ, గడివేముల

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 35వ వార్డులో ఎన్నికల ప్రచారం



35వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు మరోసారి ఓటేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం కల్లూరు అర్బన్ 35వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన వల్ల ప్రతి గడపకు లబ్ధిచేకూరిందన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు చేస్తున్న అసత్యాలను, అబద్ధాలను నమ్మి మోసం పోవదని సూచించారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గమనించాలన్నారు. సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని గతంలో ప్రచారం చేసిన టీడీపీ నాయకులు, ఇప్పుడు మా పథకాలతో పాటు మరిన్ని కొత్త పథకాలు అమలు చేస్తామంటూ మాయమాటలు చెబుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అజెండా పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు అందరికీ ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే అన్నారు.

నాన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గెలిపించాలని ఆయన కుమార్తె మాధవీలత ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం కల్లూరు అర్బన్ 29వ వార్డులోని గట్టయ్య నగర్, కస్తూరి నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని హుసేనాపురం గ్రామంలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో కఠోరమైన ఉపవాస దీక్షలు చేపట్టడం సంతోషకరమన్నారు. పెరిగిన ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే మైనార్టీల సంక్షేమ మెరుగుపడిందని తెలిపారు. మరోసారి ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల మైనార్టీ అధ్యక్షులు ఇంతియాజ్‌బాషా, యూనస్‌బాషా, నాయకులు లోటర్‌బాషా, నన్నూరు బేగ్, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, వెంగన్న, గోపా రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మీదివేముల వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓకు సమర్పిస్తున్న మీదివేముల వలంటీర్లు

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావాలని, ఆయన విజయమే ధ్యేయమని మీదివేముల వలంటీర్లు అన్నారు. బుధవారం గ్రామంలో పనిచేస్తున్న 11 మంది వలంటీర్లు తమ పదవులకు మూకుమ్మడి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ మల్లీశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సకాలంలో పేదలకు అందజేయాలనే సహృదయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని తెలిపారు. ఆయన ఆశయానికి అనుగుణంగా చాలీచాలని వేతనాలకు అందరం అంకిత భావంతో ప్రజలకు సేవలు అందించామని చెప్పారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చేసి జీర్ణించుకోలేని టీడీపీ పెద్దలు వలంటీర్లను ప్రజా కార్యక్రమాలకు దూరంగా పెట్టాలని ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం అన్యాయమన్నారు. మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు కోసం తామంతా ప్రచారం చేస్తామని స్పష్టం చేశారు. తమకు సహకరించిన అధికారులు, లబ్ధిదారులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి రాజీనామాను ఎంపీడీఓ మల్లీశ్వరి ఆమోదించినట్లు తెలిపారు.


డాక్టరేట్ ప్రదానం



నాగరాజుకుమార్

పాణ్యం: మండలంలోని నెరవాడమెట్ట వద్దనున్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ లభించిందని ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈసీఈ విభాగంగా పని చేస్తున్న నాగరాజుకుమార్ ''మల్టీ మోడల్ మెడికల్ ఇమేజ్ మోటా హెరిస్టిక్ అప్రోచెస్ ఫర్ ఇన్‌ప్రావింగ్ క్వాలిటీ ఆఫ్ మెడికల్ ఇమేజెస్'' అనే అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. చైర్మన్ శాంతిరాముడు, డైరెక్టర్ శివరాం అభినందించారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం



కోట్ల హర్షవర్ధన్, మణిగాంధీ, సతీష్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు



మునగాలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆదిమూలపు సతీష్

- కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్

గూడూరు రూరల్: పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పని చేస్తుందని ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గూడూరు మండలం మునగాల, మల్లాపురం గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీ ఇంటింటికి వెళ్లి పింఛన్లను అందించేవారన్నారు. టీడీపీ నాయకులు కోర్టు, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో వలంటీర్లను పక్కన పెట్టారని తెలిపారు. పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. టీడీపీ కుట్రల కారణంగా పింఛన్ పంపిణీలో జాప్యం నెలకొందన్నారు. 2014 మాదిరిగానే మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే అవినీతి, లంచాలు పెరిగిపోతాయన్నారు. పింఛన్ మంజూరు కావాలన్నా, సంక్షేమ పథకాలు అందాలన్నా మళ్లీ జన్మభూమి కమిటీల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంటేనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. పారదర్శకంగా అర్హులైన వారికి పథకాలు అందుతాయని తెలిపారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి కర్నూలు ఎంపీగా బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యేగా ఆదిమూలపు సతీష్‌ను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, సర్పంచ్‌లు గోపాల్, భాగ్యమ్మ, నాయకులు రామాంజనేయులు, సత్యంరెడ్డి, లక్ష్మన్న, ప్రతాప్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు వల్లే పింఛన్‌దారులకు కష్టాలు



నెరవాడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ

పాణ్యం: టీడీపీ అధినేత చంద్రబాబు కుటిల రాజకీయాల వల్లే పింఛన్‌దారులు కష్టాలు పడుతున్నారని ఎమ్మెల్యే కాటసాని ఉమామహేశ్వరమ్మ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నెరవాడ, భూపనపాడు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు ఆలస్యం కావడానికి టీడీపీ నేతలే కారణమని తెలిపారు. చంద్రబాబు తన మనుషులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం, కోర్టులో కేసులు వేయడం కారణంగా వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ఆగిపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పింఛన్‌దారులకు వలంటీర్ల ద్వారా ఠంఛన్‌గా పింఛన్ అందేదని తెలిపారు. ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేక సజావుగా సాగుతున్న పింఛన్ల పంపిణీకి మోకాలడ్డువేశారని మండిపడ్డారు.

అభివృద్ధి కనిపించట్లేదా

కళ్లముందే సచివాలయాలు, సీసీరోడ్లు, హెల్త్ సెంటర్లు, బీటీరోడ్లు, బీటీరోడ్లు, అంబులెన్స్, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు కనిపిస్తున్నా కళ్లమూసుకుపోయిన టీడీపీ నాయకులకు కనిపించట్లేదని ఎద్దేవా చేశారు. రాజకీయ స్వలాభం కోసం ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిని అడ్డుకుంటున్న వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కర్నూల్ డిప్యూటీ మేయర్ రేణుకా, జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు లింగాల శారదమ్మ, జనార్దన్, సుధారాణి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు



ఆర్యవైశ్య సంఘం నేతలు, గ్రామస్తులతో కాటసాని శివనరసింహారెడ్డి

గడివేముల: ముఖ్యమంత్రి జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు జరిగిందని, ఆయనను మరోసారి సీఎం చేసుకుందామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి అన్నారు. బుధవారం గడివేముల, కొర్రపోలూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మూలపెద్దమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నవరత్నాల పథకాలతో రాష్ట్రానికి ఎంతో మేలు జరిగిందన్నారు. ఇలాంటి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్‌పై ప్రజల్లో మరింత ఆదరణ పెరిగిందన్నారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచి పోయారన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కొద్ది రోజుల నుంచి పార్టీకి దూరంగా ఉన్న ఆర్యవైశ్య సంఘం నాయకుడు బొంతల మధుసూదన గుప్తా తన అనుచరులతో శివనరసింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, నాయకులు దస్తగిరిరెడ్డి, మధుసూదన గుప్తా, దేశం నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, ఆర్‌బి సంజీవరెడ్డి, బాలచెన్ని, ప్రతాపరెడ్డి, మహేశ్వరరెడ్డి, సర్పంచ్ మాలిక్‌బాష తదితరలు పాల్గొన్నారు.

కంబదహాల్ మాజీ సర్పంచ్ మృతి

సి.బెళగల్: మండలంలోని కంబదహాల్ మాజీ సర్పంచ్ దేవానందం (80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈయన 2006 నుంచి 2011 మధ్య కాలంలో కంబదహాల్ సర్పంచ్‌గా పని చేశారు. ఆయనకు భార్య శకుంతలమ్మ, నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మృతిపై పలువురు నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.



దేవానందం (ఫైల్)

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

కర్నూలు సిటీ: నగరానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ జానకిరాంపై నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈయన మొదట కాలేశ్వరమ్మ ను పెళ్లి చేసుకున్నాడు. ఆ తరువాత విజయవాడకు చెందిన రాజ్యలక్ష్మిని, మరి కొన్నాళ్లకు నాగమణి ను వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య కోర్టును ఆశ్రయించడంతో జానకిరాంపైకేసు నమోదు చేసినట్లు ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపారు.